# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ : విశాఖపట్నం - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 260 - గురువారం - 21 మే 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, హైదరాబాద్


## చంద్రయాన్-3 మరో సంచలనం

- విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ
- విక్రమ్ ల్యాండింగ్ సమయంలో కీలక విషయం వెలుగులోకి..

4



ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు.

### లంచగొండి అధికారులపై ఫిర్యాదు చేస్తే

## లక్ష బహుమతి!

తమిళనాడులో అవినీతిని అరికట్టేందుకు సీఎం కీలక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేసే అధికారులపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వారికి లక్ష వరకు బహుమతి ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.



4

## జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే



కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌తో కూడిన ధర్మా సనం అనుమతి ఇచ్చింది.

4



## గండికోట-2కు గ్రీన్ సిగ్నల్

- కడపలో అదానీ భారీ పవర్ ప్రాజెక్ట్
- 2250 మెగావాట్ల మెగా ప్రాజెక్ట్‌కు సర్కార్ ఓకే
- క్లీన్ ఎనర్జీ పాలసీ కింద అదానీ ప్రాజెక్టుకు ప్రోత్సాహం
- 72 నెలల్లో ప్రాజెక్టు పూర్తి లక్ష్యం

2

ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైఎస్ఆర్ కడప జిల్లాలో 2,250 మెగావాట్ల సామర్థ్యంతో 'పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు'ను అభి వృద్ధి చేసేందుకు అదానీ గ్రీన్ ఎనర్జీ అనుబంధ సంస్థ అయిన 'అదానీ హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ లిమిటెడ్'కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు మంజూరు చేశారు.

# భానుడి భగభగలు

- పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత!
- తెలంగాణలో నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఎండ
- నిప్పుల కొలిమిలా మారిన జిల్లాలు
- రాబోయే నాలుగు రోజులు మరింత జాగ్రత్త..
- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

## తెలుగు రాష్ట్రాల్లో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. రోహిణి కార్తె ప్రవేశించక ముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ జనాన్ని బెంబేలెత్తిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో ఉదయం 9 గంటల నుంచే జనం బయటకు రావడానికి జంకుతున్నారు. తాజాగా ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

- హైదరాబాద్/అమరావతి (మనసులో మాట)



## కల్తీ లేదు.. కార్బైడ్ లేదు



- రోడ్డు పక్కన తాటిముంజలు తిన్న చంద్రబాబు దంపతులు..
- కార్మికుడితో ముచ్చటించి యోగక్షేమాలు ఆరా!
- సీఎం నిరాడంబరతపై స్థానికుల ప్రశంసలు.. సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్
- కుప్పం ప్రజల మనసులాగే స్వచ్ఛమైనవి: చంద్రబాబు ట్వీట్

2

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి బుధవారం తమ పాత రోజులను గుర్తుచేసుకున్నారు. బుధవారం దంపతులు తమ సొంత నియోజకవర్గమైన కుప్పానికి రోడ్డు మార్గంలో బయలుదేరారు. రహదారి పక్కన ఒక పేద కార్మికుడు తాటిముంజలు అమ్ముతుండటం చూసి, వాహనం దిగి, ఆ కార్మికుడి వద్దకు వెళ్లి తాటిముంజలను కొనుగోలు చేయడమే కాకుండా.. అక్కడే నిలబడి తిన్నారు. ఈ అరుదైన, అందమైన క్షణాలను చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కల్తీ లేదు... కార్బైడ్ లేదు... పురుగుల మందుల గోల లేదు... మా కుప్పం ప్రజల మనసులాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటిముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. చిన్ననాటి రోజులు జ్ఞాపకానికి వచ్చాయి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### ప్రకాశం పంతులుకు స్మృతివనం

## ఏర్పాటు చేయాలి

- శాసనసభ ప్రాంగణంలో విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి
- బ్రాహ్మణ సంఘం ప్రతినిధులకు జగన్ హామీ

2



## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగం

- డిప్యూటీ స్పీకర్ ఆందోళన



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై కొంతమంది ఇప్పటికే ఆరు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు.

మిగతా 2 లో

### SENSEX - సెన్‌సెక్స్

సెన్‌సెక్స్: 75,318

నిఫ్టీ 50: 23,659



### ప్రేమ పేరుతో వివాహితకు

## వేధింపులు

యువకుడికి గుండు కొట్టి ఊరేగించిన గ్రామస్తులు..!

2

మందలించినా మారకపోవడంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న జనం

## ఆంధ్ర విద్యా నమూనా దేశానికే ఆదర్శం కావాలి

- అంతర్జాతీయ స్థాయి బోధనకు ప్రభుత్వ పాఠశాలల్లో చర్యలు
- చదువుకు దూరమైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రతి జిల్లాలో ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళిక
- విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్

2



దేశానికే ఆదర్శంగా నిలిచే ఆంధ్ర విద్యా నమూనాను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయి బోధనా విధానాలను అధ్యయనం చేసేందుకు ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నామని, అక్కడి అనుభవాలను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

## భలే మాట!



బాబు: కంగారుపడకు.. మత్స్యకారులకు నేను మార్కెటింగ్ మేనేజర్‌గా ఉంటానని మాటిచ్చ!



# కల్తీ లేదు.. కార్బైడ్ లేదు..

**రోడ్డు పక్కన తాటిముంజలు తిన్న చంద్రబాబు దంపతులు..**

**కార్మికుడితో ముచ్చటించి యోగక్షేమాలు ఆరా!**

**సీఎం నిరాడంబరతపై స్థానికుల ప్రశంసలు..**

**కుప్పం ప్రజల మనసులాగే స్వచ్ఛమైనవి: చంద్రబాబు ట్వీట్**

**చిత్తూరు:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి బుధవారం తమ పాత రోజులను గుర్తుచేసుకున్నారు. బుధవారం సీఎం దంపతులు తమ సొంత నియోజకవర్గమైన కుప్పానికి రోడ్డు మార్గంలో బయలుదేరారు. ఈ క్రమంలో రహదారి పక్కన ఒక పేద కార్మికుడు తాటిముంజలు అమ్ముతుండటం చూసి, సీఎం చంద్రబాబు తన వాహనాన్ని ఆపించారు. సీఎం దంపతులిద్దరూ స్వయంగా వాహనం దిగి, ఆ కార్మికుడి వద్దకు వెళ్లి తాటిముంజలను కొనుగోలు చేయడమే కాకుండా.. అక్కడే నిలబడి ఎంతో ఆప్యాయంగా తిన్నారు. ఈ అరుదైన, అందమైన క్షణాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కల్తీ లేదు... కార్బైడ్ లేదు... పురుగుల మందుల గోల లేదు... మా కుప్పం ప్రజల మనసులాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటిముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. చిన్ననాటి రోజులు జ్ఞాపకానికి వచ్చాయి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తాటిముంజలు అమ్మే వ్యక్తి కుటుంబ పరిస్థితులు, వ్యాపారం, యోగక్షేమాల గురించి చంద్రబాబు ఎంతో ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా తన వద్దకు వచ్చి సాదాసీదాగా మాట్లాడటంతో ఆ పేద కార్మికుడు ఆనందంలో మునిగిపోయాడు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజల కష్టం, వారి జీవన విధానం, ప్రకృతిసిద్ధమైన ఆహార ప్రాధాన్యత గురించి చంద్రబాబు మాట్లాడారు. సీఎం దంపతులు చూపిన ఈ నిరాడంబరత, ఆప్యాయతలను అక్కడ ఉన్న స్థానికులు ఎంతో ప్రశంసించారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగం

**ఆందోళన వ్యక్తం చేసిన డిప్యూటీ స్పీకర్**



**భీమవరం, మే 20:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై కొంతమంది ఇప్పటికే ఆరు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'దొంగ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం మానేయాలి' అంటూ వ్యాఖ్యానించారు. పాస్టర్ అభినయ్ దర్షన్‌పై కూడా రఘురామ తీవ్ర విమర్శలు చేశారు. 'పాస్టర్ అభినయ్ దర్శన్ మంచి నటుడు. దర్శకత్వం కూడా ఆయనే చేయాలని అనుకున్నాడు. అన్ని వేషాలు ఒకేసారి వేయాలని ప్రయత్నించాడు' అంటూ ఎద్దేవా చేశారు. తాను రెచ్చగొట్టడం వల్లే దాడులు జరుగుతున్నాయని ప్రచారం చేశారని, అలాంటి ఆరోపణలు తనపై రాకుండా పోలీసులు వెంటనే చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మత ప్రచారం పేరుతో అనేక నాటకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజోలులో సరెల్ల విజయ్ ప్రసాద్ దళిత క్రైస్తవ శాంతి ర్యాలీ నిర్వహించారని ప్రస్తావించారు. క్రైస్తవ మతంలోకి మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని తెలిపారు. 'ఘర్ వాపసీ ద్వారా తిరిగి హిందూ మతంలోకి రావడానికి అవకాశం ఉంది' అని రఘురామ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు. గుడి నిర్మాణం పూర్తి చేసే విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండదని, చెత్త రాజకీయాలు చేయడం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. ఇవాళ కాకపోతే రేపు పాస్టర్ ఆనంద్ సర్టిఫికెట్ రద్దు అవుతుందని అన్నారు. సుప్రీంకోర్టులో తామే గెలుస్తామని.. నిజాలు బయటకు రావడం ఖాయమని రఘురామకృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రేమ పేరుతో వివాహితకు వేధింపులు

**యువకుడికి గుండు కొట్టి ఊరేగించిన గ్రామస్తులు..!**

**అనంతపురం, మే 20:** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో ప్రేమ పేరుతో ఓ వివాహితను వేధిస్తున్నాడన్న ఆరోపణలతో గ్రామస్తులు యువకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనికి గుండు కొట్టి చెప్పులు, చీపురులు కట్టి గ్రామంలో ఊరేగించిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు కొంతకాలంగా వివాహితను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పలుమార్లు మందలించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని సమాచారం. దీంతో గ్రామస్తుల్లో అసహనం పెరిగింది. ఆగ్రహంతో యువకుడిని పట్టుకున్న గ్రామస్తులు దేహశుద్ధి చేసినట్లు తెలుస్తోంది. అనంతరం గుండు కొట్టి గ్రామంలో ఊరేగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. యువకుడిపై వచ్చిన ఆరోపణలతో పాటు గ్రామ-స్తులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అంశంపైనా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలపై వేధింపుల విషయంలో కఠిన చర్యలు అవసరమని కొందరు అభిప్రాయపడుతుండగా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వ్యక్తులను అవమానించడం సరైంది కాదని మరికొందరు అంటున్నారు.


# గండికోట-2కు గ్రీన్ సిగ్నల్

- కడపలో అదానీ భారీ పవర్ ప్రాజెక్ట్
- 2250 మెగావాట్ల మెగా ప్రాజెక్ట్‌కు సర్కార్ ఓకే
- క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రాజెక్టుకు ప్రోత్సాహం
- 72 నెలల్లో ప్రాజెక్టు పూర్తి లక్ష్యం



**అమరావతి, మే 20:** ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైఎస్ఆర్ కడప జిల్లాలో 2,250 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు అదానీ గ్రీన్ ఎనర్జీ అనుబంధ సంస్థ అదానీ హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ లిమిటెడ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేశారు. 'గండికోట-2' పేరుతో లార్డ్ బాలాజీ దొంతి కోన పీఎస్పీ పార్కులో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. దేశంలోనే అతిపెద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులలో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, డేటా సెంటర్ల వంటి అధునాతన పరిశ్రమలకు అవసరమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. పంప్డ్ స్టోరేజీ విధానంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న సమయంలో మిగులు విద్యుత్‌తో నీటిని పైభాగానికి పంపించి, అవసరమైన సమయంలో తిరిగి కిందకు వదిలి టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. దీంతో 24 గంటల పాటు స్వచ్ఛమైన విద్యుత్ అందించే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం గండికోట జలాశయం నుంచి ఒకేసారి నింపేందుకు 29.20 ఎంసీఎం నీటిని, ప్రతి ఏడాది ఆవిరి నష్టాల భర్తీకి 2.20 ఎంసీఎం నీటిని కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ--2024 కింద ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈ విధానం ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రాజెక్టును 72 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని ప్రభుత్వం వెల్లడించింది.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు




**పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత!**

**తెలంగాణలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఎండ**

**రెండు రాష్ట్రాల్లోనూ 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**నిప్పుల కొలిమిలా మారిన జిల్లాలు**

**రాబోయే నాలుగు రోజులు మరింత జాగ్రత్త..**

**విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**

**హైదరాబాద్/అమరావతి:** తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలో నిర్మల్ జిల్లాలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హన్మకొండలో 46.4 డిగ్రీలు, జగిత్యాలలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కృష్ణా జిల్లా కంకిపాడు, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని నందనమారెళ్లలో 46.1 డిగ్రీలు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మధ్యాహ్న వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. తాగునీరు ఎక్కువగా తీసుకోవడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆంధ్ర విద్యా నమూనా దేశానికే ఆదర్శం కావాలి

- అంతర్జాతీయ స్థాయి బోధనకు ప్రభుత్వ పాఠశాలల్లో చర్యలు
- చదువుకు దూరమైన విద్యార్థులపై దృష్టి
- ప్రతి జిల్లాలో ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళిక
- రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్



**అమరావతి, మే 20 :** దేశానికే ఆదర్శంగా నిలిచే ఆంధ్ర విద్యా నమూనాను రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయి బోధనా విధానాలను అధ్యయనం చేసేందుకు ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నామని, అక్కడి అనుభవాలను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి సచివాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య కూడా పోటీ ప్రపంచానికి తగిన స్థాయికి చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను సొంత పిల్లల్లా భావించాలని అధికారులకు సూచించారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష మందికి పైగా పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని, వారిని తిరిగి పాఠశాలలకు తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వలస కార్మికుల కుటుంబాలకు చెందిన పిల్లలు చదువు మానేసి పనులకు వెళ్లే పరిస్థితి లేకుండా చూడాలని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. గ్యారంటీడ్ ప్రాథమిక అభ్యాస కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికత వినియోగంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్లిక్కర్ సాంకేతికత, క్రోమ్ పుస్తకాలు అందించనున్నట్లు చెప్పారు. కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యాస విధానాలు, డిజిటల్ విద్యా పద్ధతులను త్వరలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. లీకేజీలు లేని భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు వంటి సౌకర్యాలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ వంటశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు పాఠశాలను అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి జిల్లాలో కనీసం ఒక ఆదర్శ పాఠశాలను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. విద్యలో సాంకేతికతతో పాటు నైతిక విలువలు కూడా ముఖ్యమని మంత్రి తెలిపారు. ప్రతి శనివారం విలువల ఆధారిత విద్య, యోగా, క్రీడలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖలో ఇప్పటికే పలు సంస్కరణలు అమలు చేశామని, ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి పెట్టేలా మార్పులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

# ప్రకాశం పంతులుకు స్మృతివనం ఏర్పాటు చేయాలి

**తాడేపల్లి, మే 20 :** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు జగన్‌ను కలిసి కీలక వినతిపత్రం సమర్పించారు. రాజధానిలో ప్రకాశం పంతులుకు గుర్తుగా స్మృతివనం ఏర్పాటు చేయాలని, శాసనసభ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో దక్షిణ భారతదేశం నుంచి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి త్యాగాలు, జీవిత విశేషాలు భావితరాలకు తెలియజేసేలా ప్రత్యేక స్మారక నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ నాయకత్వంలో సంఘ ప్రతినిధులు ఈ అంశాన్ని జగన్ దృష్టికి తీసుకువచ్చారు. చరిత్రలో ప్రకాశం పంతులు సేవలు చిరస్థాయిగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై స్పందించిన జగన్, అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అంశాన్ని పరిశీలించి స్మృతివనం, విగ్రహ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. జగన్ హామీపై బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొని ప్రకాశం పంతులకు ఘన నివాళులర్పించారు.



# డిజిటల్ రూపాయితో రేషన్ పంపిణీ

- ఏపీ ప్రభుత్వ కొత్త విధానంపై మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**విజయవాడ, మే 20 :** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ పంపిణీ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా కేంద్ర బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ద్వారా రేషన్ సరుకులు అందించే దిశగా చర్యలు చేపడుతోంది. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రితో సమావేశమైన అనంతరం మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. కొత్త విధానం ప్రకారం ప్రతి రేషన్ కార్డు కుటుంబానికి ప్రత్యేక డిజిటల్ వ్యాలెట్ ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ మొత్తాన్ని డిజిటల్ రూపాయి రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అనంతరం ఆ మొత్తంతో రేషన్ దుకాణాల్లో సరుకులు కొనుగోలు చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ విధానంలో బయోమెట్రిక్



అవసరం ఉండదని మంత్రి తెలిపారు. ప్రభుత్వం జమ చేసిన సబ్సిడీ వివరాలు లబ్ధిదారులకు స్పష్టంగా కనిపిస్తాయని, డీలర్లకు కూడా తమ మార్జిన్‌పై పూర్తి అవగాహన ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అమలవుతోందని, త్వరలో విజయవాడ, విశాఖపట్నంలో కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. రేషన్ పంపిణీతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఇకపై సన్న బియ్యానికి బదులుగా నాణ్యమైన ఆవిరి బియ్యం సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి రెండు లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం రైతులకు మేలు చేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించేందుకు వెయ్యి మినీమార్టులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే అరకు కాఫీని దేశవ్యాప్తంగా మిలటరీ క్యాంటీన్లలో విక్రయించేందుకు అనుమతి లభించినట్లు తెలిపారు. దీంతో అరకు కాఫీకి మరింత ప్రాచుర్యం లభించే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# శ్రీశ్రీ రవిశంకర్ గొప్ప మానవతావాది

**జాతి నిర్మాణంలో ఆయనది గొప్ప పాత్ర**

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవంలో చంద్రబాబు**

**బెంగళూరు, మే 20:** 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్యాత్మిక నాయకుడే కాదు.. గొప్ప మానవతావాది అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఆ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతి నిర్మాణానికి తోడ్పడుతున్న శ్రీశ్రీ రవిశంకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సామరస్య సందేశం చేరవేతతో పాటు ఆధునిక భారత్‌కు ఆయన వారధి. అనేక ఖండాల్లో గురుదేవ్ దశాబ్దాలుగా సందేశాలు ఇస్తున్నారు. ఒత్తిడి రహిత జీవితం, హింస లేని సమాజం కోసం ఆయన పాటుపడ్డారు. సమాజంలో నెలకొన్న సంఘర్షణలు, అస్థిరతను పారద్రోలేందుకు కృషి చేశారు. ప్రపంచ దేశాల నుంచి మారుమూల గ్రామాల వరకు అహింస స్థాపనకు పాటుపడ్డారు. 45 ఏళ్ల క్రితం సాధారణ విజన్‌తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏర్పడింది. ఈ సంస్థ వార్షికోత్సవంలో పాల్గొనడం గొప్ప గౌరవం.ఇది వ్యక్తిగత, వ్యవస్థ వేడుక కాదు..మానవత్వ విలువలకు వేడుక అని కొనియాడారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల కారణంగా దేశం ఇబ్బందుల్లో ఉంది. ఎంత కష్టకాలమైనా ఎదుర్కొనే గొప్ప నేత మోదీ ప్రధానిగా ఉన్నారు. ఏపీని టెక్నాలజీ హబ్‌గా రూపొందిస్తున్నాను. ఎన్నో కొత్త టెక్నాలజీలకు రాష్ట్రాన్ని వేదికగా చేస్తున్నాను. టెక్నాలజీలు ఎన్ని వచ్చినా ప్రశాంతత లేకుంటే ఉపయోగం ఉండదు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఏపీకి తన సేవలు అందించాలి. అత్యుత్తమ రాష్ట్రంగా



నిలిపేందుకు గురూజీ సహకారం కావాలని చంద్రబాబు అన్నారు. ఐటీ సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ వేదికపై నిలిపారని కొనియాడారు. అమెరికా సదస్సులో చంద్రబాబు గొప్ప విషయం చెప్పారు. యువతలో అత్యుత్తమ పరివర్తన సాధించడం తన లక్ష్యమన్నారు. నేడు ఆయన తన లక్ష్యాన్ని సాధించారు. అమెరికాలో ఏపీకి చెందిన 60-70 శాతం మంది ఐటీ ఉద్యోగులు తెలుగు మాట్లాడతారు. మేరీల్యాండ్, వర్జీనియా ప్రాంతాలు మినీ ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నాయని శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు.

# ప్రగతితో పాటు ప్రజల ఆరోగ్యమూ ముఖ్యమే

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!
- కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ వార్నింగ్

**మంగళగిరి, మే 21:** దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంత అవసరమో, ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని, శబ్ద కాలుష్య నియంత్రణపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట ఇతరులకు ఇబ్బందులు కలిగించే హక్కు ఎవరికీ లేదన్నారు. జనావాసాల సమీపంలో మైనింగ్ పేలుళ్ల కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇళ్లకు బీటలు పడుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను అన్ని మైనింగ్ సంస్థలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలుష్య



నియంత్రణ మండలి తనిఖీల్లో బాధితులను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ సూచించారు. దీంతో తనిఖీలు మరింత పారదర్శకంగా జరిగి ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో కొన్ని వైట్ కేటగిరీ పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా దుర్వాసనలు, కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతతో దుర్వాసన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. గోస్తనీ నది కాలుష్యంపై కూడా పవన్ కళ్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి నేరుగా మురుగు, రసాయన వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయని, డ్రోన్లు, వీడియో రికార్డింగ్ ద్వారా ఆధారాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద రాష్ట్రంలోని 13 నగరాలకు కేటాయించిన రూ.400 కోట్ల నిధులను సమర్థంగా వినియోగించి గాలి నాణ్యత మెరుగుపర్చాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరతపై అధికారులు దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత ఫైల్‌ను ముందుకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

# పర్యాటక రంగానికి ప్రోత్సాహం

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్**

**అమరావతి, మే 20:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచన మేరకు విదేశీ ప్రయాణాలు తగ్గించి.. దేశీయ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామని ఆంధప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ఇంధన పొదుపుతో పాటు విదేశీ ప్రయాణాలు తగ్గించాలని ప్రధాని కోరారని పేర్కొన్నారు. బుధవారం ఏపీ సచివాలయంలో మంత్రి కందుల దుర్గేశ్ మీడియాతో మాట్లాడారు. టూరిజం విషయంలో బయటదేశాలకు వేళ్లేవారు ఎక్కువని.. మన దేశానికి వచ్చేవారు తక్కువని చెప్పుకొచ్చారు. దీని వల్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చుయిపోతుందని అన్నారు. దీంతో



హాలిడే ఇన్ ఆంధప్రదేశ్ అనే క్యాంపెయిన్‌ను చేయాలని తాము నిర్ణయించామని తెలిపారు. ఏడాది పాటు ఈ నినాదంతో పనిచేయాలని నిర్ణయించామని.. ఈ విషయంపై టూరిజం స్టేక్ హోల్డర్స్ అందరితో మాట్లాడామని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. టూరిజం సర్క్యూట్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్ చేయడంతో ఏపీ, కేంద్రం, సీఎస్ఆర్ సహకారం తీసుకోవాలని నిర్ణయించామని మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ట్రీ డేస్ ఇన్ తిరుపతి వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ఈ క్యాంపెయిన్‌కు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సర్వీసులు వినియోగించుకుంటామని అన్నారు. ఏపీకి ఎయిర్ కనెక్టివిటీ చాలా ఉందని చెప్పుకొచ్చారు. ఏపీకి అన్నిరకాల కనెక్టివిటీలు ఉన్నాయని ప్రస్తావించారు. భద్రతా ప్రమాణాలను టూరిజంలో పెంచడానికి టాప్ ప్రయార్టీ ఇచ్చామని తెలిపారు. సర్వీసెస్ ఫెసిలిటీస్ ఇచ్చే వారి విషయంలో ఆధునికీకరిస్తున్నామని అన్నారు. రెండేళ్లతో పోలిస్తే పరిస్థితులు చాలావరకూ మెరుగయ్యాయని తెలిపారు. అన్ని స్టేక్ హోల్డర్‌లతో కలిసి స్పెషల్ ప్యాకెజీలు ఎంతో ఉపయోగ పడతాయని వివరించారు. పర్యటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా టూరిజం 17.75 శాతం వృద్ధి చెందిందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.



# కువైట్‌లో చంద్రగిరి మహిళ ఇక్కట్లు

**మహిళను వెనక్కి రప్పించాని సిఎం ఆదేశం**

అమరావతి, మే 20: కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ఆదేశించారు. చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన భాగ్యవతి ఉపాధి కోసం ఫిబ్రవరిలో కువైట్‌కు వెళ్లగా, అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఓ వీడియో విడుదల చేసింది. గృహ సహాయకురాలిగా పనిచేస్తున్న తనకు సంబంధిత ఏజెంట్లు సరైన ఉద్యోగ వీసా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నట్లు వీడియో ద్వారా తెలిపింది. స్వదేశానికి పంపాలంటే డబ్బులు చెల్లించాలని ఏజెంట్లు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈ ఘటనపై వచ్చిన మీడియా కథనాలకు ముఖ్యమంత్రి కార్యాలయం వెంటనే స్పందించింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం సూచనలతో వెంటనే స్పందించిన ఏపీ ఎన్ఆర్టీ అధికారులు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు ప్రారంభించారు. భాగ్యవతి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆమెను త్వరితగతిన స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనలో సంబంధిత ఏజెంట్ల పాత్రపై విచారణ జరపాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే న్యాయపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇక తిరుపతి జిల్లా యంత్రాంగం బాధితురాలి కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉంది. చంద్రగిరి పోలీసులు కూడా కుటుంబానికి భరోసా కల్పిస్తూ, భాగ్యవతి సురక్షితంగా తిరిగి వచ్చే వరకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన మరోసారి విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. విదేశాలకు వెళ్లే ముందు అధికారిక అనుమతులు, వీసా వివరాలు పూర్తిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఎరువుల అక్రమ రవాణాపై మంత్రి సీరియస్..

**బ్లాక్ మార్కెట్ అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీల ఆదేశం**

**డీలర్ల లైసెన్సుల రద్దుతో పాటు క్రిమినల్ కేసుల హెచ్చరిక**



**అమరావతి, మే 20 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎరువుల అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అందాల్సిన ఎరువులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలకు సిద్ధమైంది. ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు కృత్రిమ కొరత సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, రైతులకు అవసరమైన సమయంలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు విజిలెన్స్ బృందాల నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎరువులను పక్కదారి పట్టిస్తున్నట్లు తేలితే సంబంధిత డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. రైతులను మోసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

# బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై కేసు నమోదు

**మంత్రి టీజీ భరత్ ఫిర్యాదుతో పోలీసుల చర్య**

**కర్నూలు ధర్నాలో వ్యాఖ్యలపై దర్యాప్తు ప్రారంభం**




**కర్నూలు, మే 20 :** వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై కర్నూలులో కేసు నమోదైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ గుప్తా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ శేషయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న కర్నూలు కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్‌పై తీవ్ర ఆరోపణలు చేసినట్లు సమాచారం. తనపై చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేలా ఉన్నాయని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నంగా భావిస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ పోలీసులను ఆశ్రయించారు. మంత్రి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ప్రసంగాల వివరాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

KANCHARLA మనసులో మాట

# చంద్రయాన్-3 మరో సంచలనం

- విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ
- విక్రమ్ ల్యాండింగ్ సమయంలో కీలక విషయం వెలుగులోకి..



**బెంగళూరు:** ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్ వద్ద ఉన్న నేల గతంలో భావించిన దానికంటే చాలా వైవిధ్యమైనదని, సంక్లిష్టమైనదని వెల్లడించే ఒక మైలురాయిగా ఈ ప్రయోగం నిలిచింది. ఈ ప్రయోగంలో ల్యాండర్ సుమారు 40 నుంచి 50 సెంటీమీటర్లు పైకి ఎగిరి, కొద్దిదూరం పక్కకు వెళ్లి మళ్లీ సాఫ్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ప్రయోగం వల్ల చంద్రుడి ఉపరితలంపై ఉన్న పై పొర తొలగిపోయి, లోపలి మట్టిని చంద్ర సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పరికరం పరిశీలించే అవకాశం లభించింది. దీంతో చంద్రుడి మట్టి ఒకేలా కాకుండా పలు పొరలుగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పైభాగం పొర చాలా మెత్తగా ఉండగా, కింద భాగం మరింత ఘనంగా ఉందని అధ్యయనం తెలిపింది. ఈ సమాచారం భవిష్యత్ చంద్ర మిషన్లకు చాలా కీలకంగా మారనుంది. ముఖ్యంగా నాసా ఆర్టెమిస్ మిషన్ ద్వారా చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలకు ఈ డేటా ఉపయోగపడనుందని నిపుణులు చెబుతున్నారు. 2023 జులై 14న ప్రయోగించిన చంద్రయాన్ 3, చంద్రుని దక్షిణ ధృవం ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ అయి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్ట మొదటి దేశంగా భారత్ నిలిచింది.



# ట్రంప్ దూకుడుకు అమెరికా సెనెట్ కత్తెర!

## ఇరాన్‌పై యుద్ధ హెచ్చరికల మధ్య అధ్యక్ష అధికారాలపై పరిమితులు

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు.. ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు

**ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం, యుద్ధ భయాలు, ఆహార కొరతలతో వణుకుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్‌పై యుద్ధ డప్పు మోగిస్తూనే ఉన్నారు. "చర్చలు విఫలమైతే రెండు మూడు రోజుల్లోనే దాడులు ప్రారంభమవుతాయి" అంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి.**

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహారశైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమినియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిగ్గ÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వణ్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.



**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# లంచగొండి అధికారులపై ఫిర్యాదు చేస్తే రూ.లక్ష బహుమతి!

## అవినీతి నిర్మూలనపై సీఎం విజయ్ ఫోకస్

## ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యం

## ప్రభుత్వ శాఖలకు మూడు నెలల గడువు

**చెన్నై, మే 20:** తమిళనాడులో అవినీతిని అరికట్టేందుకు సీఎం విజయ్ ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేసే అధికారులపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వారికి రూ.1 లక్ష వరకు బహుమతి ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అవినీతి అధికారులపై నేరుగా ప్రజల నుంచే సమాచారం సేకరించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ పోర్టల్, ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసే వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని ప్రభుత్వం హామీ ఇస్తున్నట్లు సమాచారం. అవినీతి నిరోధక శాఖలో కూడా సమూల మార్పులు తీసుకురావాలని సీఎం విజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. శాఖలో రాజకీయ జోక్యం, అంతర్గత అవినీతి వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీస్, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. టెండర్లు, కాంట్రాక్టులు, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమాచారం. "ప్రజల డబ్బు పవిత్రమైనది.. అవినీతి చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం" అంటూ అధికారులకు సీఎం విజయ్ గట్టి హెచ్చరిక జారీ చేసినట్లు తెలుస్తోంది.






# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

## యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం

**వాషింగ్టన్, మే 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

## పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం

**న్యూఢిల్లీ, మే 20:** సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ఉాక్షఖ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.



# జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

## వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 20:** కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.



# అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్లబండి

## నేడు రాళ్లబండి కవితాప్రసాద్ జయంతి

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్.

సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.

కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు.

ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్ఛిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పిహెచ్‌డి చేశారు.

కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి. హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు. ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు.

వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝరి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరా బాదులో హృద్రోగంతో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నవలా సాహిత్య సామ్రాజ్ఞి.. సులోచనారాణి

## నేడు యద్దనపూడి సులోచనారాణి వర్ధంతి



యద్దనపూడి సులోచనారాణి. తెలుగు ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. దశాబ్దాల పాటు తెలుగు నవలా పాఠకులకు, తెలుగు సినిమా ప్రేక్షకులకు అభిమాన రచయిత్రి. తెలుగు నవలా సామ్రాజ్యాన్ని ఐదు దశాబ్దాల పాటు ఏలిన సాహిత్య సామ్రాజ్ఞి. ఆమె నవలల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. ఆమె పాత్రలలో సజీవత్వం తొణికిస లాడుతుంది. పెళ్ళికాని యువతలో, గృహిణుల్లోనూ పాఠక శక్తిని పెంపొందించిన ఘనత ఆమెకే దక్కింది. మధ్యతరగతి కుటుంబ పరిస్థితులే ఆమె పాత్రల నేపథ్యం కాగా, యువతీ యువకుల నుండి వయసు మళ్లిన వారి వరకు ఆమె అభిమాన రచయిత్రిగా మారారు. ఆధునిక జీవనశైలి కి భిన్నమైన, చర్విత చర్వణంగా దినచర్యలు కలిగిన నాటి పరిస్థితులలో రేడియో కార్యక్రమాలు వినడం, నవలలు చదవడం, అప్పుడప్పుడూ సినిమాలు చూడడం సర్వత్రా చోటు చేసుకున్న కాలంలో యద్దనపూడి నవలలు వయసు తో నిమిత్తం లేకుండా నిత్య పఠనాసక్తిని కలిగించాయి అంటే ఆమె రచనా వ్యాసంగం ఎంతటి ప్రభావాన్ని పాఠక లోకంపై చూపిందో స్పష్టం అవుతున్నది. చర్విత చర్వణం లా సాగే నాటి ప్రజా జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనించి, తను పరిశీలించిన జీవితాలను కథా వస్తువులుగా తీసుకొని, పాఠకులకు నచ్చిన రీతిలో ఆమె రచనలు చేశారు. మధ్యతరగతి అమ్మాయిల ఊహలు, అంతరంగానికి, ఆశలకు, స్వాభిమానానికి యద్దనపూడి నవలలు అద్దంపడతాయని నాటి పాఠకులు భావించేవారు. అమ్మాయిల ఆత్మాభిమానం, తల వంచని వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసం, హుందాతనం, మాటకారితనం ప్రతి ఆడ పాత్రలో కనిపిస్తాయి. ప్రతివారి హృదయాలకు హత్తుకునేలా పాత్రల సృష్టి చేశారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని నిరూపించారు. అందుకే ఆమె రాసిన నవలల ఆధారంగా అనేక సినిమాలు తీసినా అవి నేటికీ అద్భుత చిత్రాలుగా మన గలుగు తున్నాయి. అలాగే ఆమె రచనలు కేవలం సినిమాలు గానే కాక అనేక టీ.వీ. ధారా వాహికలుగా రూపొందించ బడ్డాయి.

1940లో ఏప్రిల్ 2న కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజా గ్రామంలో జన్మించిన యద్దనపూడి సులోచనారాణి తొలిసారిగా చదువుకున్న అమ్మాయిలు చిత్రం ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. 1965లో మనుషులు – మమతలు సినిమాకు కథను అందించారు. తర్వాత వీరు రాసిన మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమ లేఖలు, విచిత్ర బంధం, బంగారు కలలు లాంటి నవలలు చలన చిత్రాలుగా వచ్చాయి. అయితే సెక్రటరీ మాత్రం ఓ అద్భుత ట్రెండ్ సెట్టర్ గా మిగిలి పోయింది. ఆ రోజుల్లో ప్రతి యువకుడు ఓ రాజశేఖరంలా ప్రతి యువతీ ఆత్మాభిమానం గల జయంతిలా ఉండాలనుకునే వారు. 1965 లో మార్కెట్ లోకి వచ్చి సంచలనం సృష్టించింది సెక్రెటరీ నవల. 20 వ శతాబ్దపు బెస్ట్ సెల్లర్ ఏకంగా 75 ముద్రణలు చేసుకున్న నవల ఇది. సీరియల్స్ గా వచ్చినపుడు పాఠకులను మంత్ర ముగ్ధులను చేసేవి కొన్ని నవలలు. సెక్రటరీ, జీవన తరంగాలు, మీన్న, విజేత, ఆరాధన, కీర్తి కిరీటాలు, ప్రేమ లేఖలు, గిరిజా కల్యాణం, పార్థు, ఈ తరం కథ, ఆత్మీయులు, బంగారు కలలు, కథల్లో బహుమతి, ఐలవ్ యూ... ఇంకా ఎన్నో ఆమె అభిమానులు మెచ్చినవి. ఎన్ని సార్లు ప్రచురించినా, అన్ని ప్రతులూ అతి వేగంగా అమ్ముడు పోయేవి. సులోచనా రాణి శైలి అమోఘం, అనన్యం, అపూర్వం, అనితర సాధ్యం. మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, విచిత్ర బంధం, జై జవాన్, ఆత్మ గౌరవం తదితర నవలలను సినిమాలుగా తీశారు.

యద్దనపూడి సులోచనారాణి వయస్సు మళ్లిన ఒంటరి మహిళల కోసం 'విన్' పేరుతో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు ఏడేళ్ల పాటు ఆశ్రమాన్ని నిర్వహించారు కూడా. అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల తన ఆత్మీయులకు హోం బాధ్యతను అప్పగించారు. అనాథ బాలలు, మురికివాడల్లోని పిల్లల కోసం తన ఇంటి ఆవరణ లోనే కొద్ది రోజుల పాటు ప్రత్యేక పాఠశాలను నిర్వహించారు. 'పరాశర' స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాథ బాలల వసతి గృహాలు, వయోధికుల ఆశ్రమాలకు బియ్యం, పప్పు వంటి నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం అందించారు. సెక్రటరీ 50ఏళ్ల వేడుకలో పది మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం ద్వారా చేయూత అందించారు. 2018, మే 21న అమెరికా లోని కాలిఫోర్నియాలో తన కూతురు నివాసంలో గుండె పోటుతో గుండెపోటుతో మృతిచెందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాజీవ్ రక్తంతో రాసుకున్న పాఠం!

## మే 21 దేశాన్ని కుదిపేసిన దారుణం
## తీవ్రవాదానికి బలైన మాజీ ప్రధాని
## ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహణ



దేశ రాజకీయ చరిత్రలో మే 21 ఒక విషాద దినం. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తీవ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన రోజు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో ఎన్నికల ప్రచార సభలో ఎల్‌టిటిఈ ఆత్మాహుతి దాడిలో రాజీవ్ గాంధీ హతమయ్యారు. ఆ దారుణ ఘటన దేశాన్ని ఒక్కసారిగా షాక్‌కు గురి చేసింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది మే 21ను "జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం"గా నిర్వహిస్తున్నారు. తీవ్రవాదం ఎంత ప్రమాదకరమో ప్రజలకు తెలియజేయడం, దేశ ఐక్యతను కాపాడడం, హింసకు దూరంగా సహజీవనం చేయాలనే సందేశాన్ని చాటడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజాసంఘాలు దేశవ్యాప్తంగా ఈరోజు ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి.

### 40 ఏళ్లకే దేశ పగ్గాలు

1944 ఆగస్టు 20న జన్మించిన రాజీవ్ గాంధీ, 1984లో తన తల్లి ఇందిరా గాంధీ హత్య అనంతరం దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో అత్యంత యువ ప్రధానిగా చరిత్ర సృష్టించారు. ఆధునిక భారత నిర్మాణంలో కంప్యూటర్ విప్లవం, టెలికాం రంగ అభివృద్ధికి పునాది వేసిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. 1991 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజీవ్ గాంధీ తమిళనాడులో పర్యటిస్తుండగా శ్రీపెరంబుదూరులో జరిగిన సభలో ఎల్‌టిటిఈకి చెందిన ఆత్మాహుతి దళ సభ్యురాలు "థాను" పూలమాల వేసే నెపంతో ఆయనకు చేరువై తన శరీరానికి కట్టుకున్న ఆర్డీఎక్స్‌ను పేల్చింది. ఆ భారీ పేలుడులో రాజీవ్ గాంధీతో పాటు పలువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆ దృశ్యాలు దేశాన్ని కుదిపేశాయి. భద్రతా వ్యవస్థలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును ఛేదించింది. విచారణలో ఎల్‌టిటిఈ కుట్ర బట్టబయలైంది.

### తీవ్రవాదంపై పోరాటానికి ప్రతిజ్ఞ

రాజీవ్ గాంధీ హత్య అనంతరం దేశంలో తీవ్రవాద వ్యతిరేక చర్యలు మరింత కఠినమయ్యాయి. ఉగ్రవాదం మానవత్వానికి శత్రువని, దాన్ని సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందనే సందేశంతో మే 21ను కేంద్ర ప్రభుత్వం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం కొత్త రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ దినోత్సవ ప్రాధాన్యం మరింత పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. హింస కాదు.. శాంతి, సహనం, ప్రజాస్వామ్యమే దేశ బలం అన్న సందేశాన్ని ఈ రోజు మరోసారి గుర్తుచేస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కప్పు టీతో కాసింత ఉల్లాసం!



**నేడు అంతర్జాతీయ టీ దినోత్సవం**

**ప్రపంచాన్ని ఒక్కటి చేసిన తేనీటి రుచి**

**ఆరోగ్యానికీ.. ఆత్మీయతకీ టీనే చిరునామా**

ఉదయం కళ్లు తెరిచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ మనిషి జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది టీ. అలసటలోనూ, ఆలోచనల్లోనూ, ఆత్మీయ సంభాషణల్లోనూ మొదటి గుర్తుకొచ్చేది ఒక కప్పు తేనీరే. అందుకే ప్రపంచవ్యాప్తంగా టీకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి మే 21ను "అంతర్జాతీయ టీ దినోత్సవం"గా ప్రకటించింది. టీ ఉత్పత్తి చేసే దేశాల్లో వినియోగాన్ని పెంచడం, టీ కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడం, టీ పరిశ్రమను మరింత బలోపేతం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

### చైనా నుంచి ప్రపంచవ్యాప్తంగా

చరిత్ర ప్రకారం క్రీస్తుపూర్వం 2737లో చైనా చక్రవర్తి షెన్‌నంగ్ తొలిసారిగా టీని కనుగొన్నారు. వేడి నీటిలో తేయాకు పడటంతో వచ్చిన రుచి ఆయనకు నచ్చి టీ పుట్టుకకు నాంది పలికిందని చెబుతారు. అనంతరం శతాబ్దాల పాటు టీ ఔషధంగా ఉపయోగించబడింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా పానీయంగా విస్తరించింది. భారతదేశంలో టీ సాగు 19వ శతాబ్దంలో ప్రారంభమైంది. అస్సాం, డార్జిలింగ్, నీలగిరి ప్రాంతాలు ప్రపంచ ప్రఖ్యాత టీ ఉత్పత్తి కేంద్రాలుగా ఎదిగాయి. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీ ఉత్పత్తిదారుల్లో ఒకటి.

### భారతీయుడి జీవితంలో టీ

ఒకప్పుడు కాఫీ సంస్కృతి ఎక్కువగా ఉన్నప్పటికీ.. కాలక్రమేణా టీ సామాన్యుడి పానీయంగా మారిపోయింది. తక్కువ ధరలో అందుబాటులో ఉండటం, వివిధ రకాల రుచులు రావడం, వెంటనే ఉల్లాసాన్ని కలిగించడం టీకి మరింత ఆదరణ తెచ్చాయి. ఇప్పుడు ప్రతి వీధిలో టీ స్టాల్ కనిపించడం సాధారణం. ఉద్యోగి నుంచి విద్యార్థి వరకూ, రైతు నుంచి వ్యాపారి వరకూ అందరికీ టీ ఒక భావోద్వేగంగా మారింది.

### రకాలెన్నో.. రుచులెన్నో

ప్రపంచవ్యాప్తంగా టీ అనేక రూపాల్లో అందుబాటులో ఉంది. గ్రీన్ టీ, బ్లాక్ టీ, వైట్ టీ, మసాలా టీ, అల్లం టీ, కహ్వా, ఐస్ టీ, బబుల్ టీ ఇలా రకరకాల టీలు ప్రజాదరణ పొందుతున్నాయి. భారతదేశంలో మసాలా టీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. కాశ్మీర్‌లో కహ్వా, గుజరాత్‌లో మసాలా టీ, దక్షిణాదిలో పాల టీ విస్తృతంగా వినియోగిస్తారు. టీలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి రక్షణ కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యానికి, ఒత్తిడి తగ్గించడంలో, జీర్ణక్రియ మెరుగుపరచడంలో టీ ఉపయోగపడుతుంది. గ్రీన్ టీ బరువు తగ్గించడంలో కూడా సహాయపడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే అతిగా టీ సేవించడం వల్ల అసిడిటీ, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి సమస్యలు రావచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పరిమితంగా తీసుకోవడమే మంచిదని సూచిస్తున్నారు.

### టీతోనే ఆత్మీయత

టీ కేవలం పానీయం మాత్రమే కాదు.. అది మనుషులను దగ్గర చేసే బంధం. కుటుంబ సమావేశం కావచ్చు.. స్నేహితుల కబుర్లు కావచ్చు.. రాజకీయ చర్చలైనా కావచ్చు.. ఒక కప్పు టీతోనే మొదలవుతాయి. అందుకే ప్రపంచం ఎంత ఆధునికమవుతున్నా.. "ఒక కప్పు టీ"కి ఉన్న ప్రత్యేక స్థానం మాత్రం ఎప్పటికీ చెరిగిపోదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మద్యం ధరలు పెరిగే ఛాన్స్



## బంగారం పెరిగింది.. వెండి భారీగా తగ్గింది


**హైదరాబాద్, మే 20 :** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీ హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఇటీవల పసిడి ధరలు తగ్గుముఖం పట్టగా, ఇప్పుడు మళ్లీ ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు వెండి ధర మాత్రం అనూహ్యంగా భారీగా పడిపోయింది. నేటి ఉదయం మార్కెట్ పరిస్థితులను పరిశీలిస్తే హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 పెరిగి రూ.1,58,350కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,45,150గా నమోదైంది. వెండి ధరలో మాత్రం భారీ పతనం కనిపించింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.15 వేల మేర తగ్గి రూ.2.85 లక్షలకు చేరింది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,58,350గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,45,150గా నమోదైంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,58,500కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,45,300గా ఉంది. వెండి ధరలు నగరాల వారీగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కిలో వెండి రూ.2.85 లక్షలుగా ఉండగా, మరికొన్ని నగరాల్లో రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పులు, డాలర్ మారకం విలువ, దిగుమతి సుంకాలు వంటి అంశాల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ మారుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

## లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబై, మే 20 :** ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు మధ్యాహ్నం తర్వాత బలంగా కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్ఠాలతో పోలిస్తే సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్లు పుంజుకోవడం గమనార్హం. కనిష్ఠ స్థాయిల వద్ద పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపడం మార్కెట్లకు ఊతమిచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్ల దిగువకు రావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతున్నాయన్న సంకేతాలు కూడా సానుకూల ప్రభావం చూపించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ చివరకు లాభాలతో ముగిశాయి. గత ట్రేడింగ్ ముగింపుతో పోలిస్తే ఉదయం సెన్సెక్స్ దాదాపు 400 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరింత దిగజారింది. అయితే మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 117 పాయింట్లు పెరిగి 75,318 వద్ద ముగియగా, నిఫ్టీ 41 పాయింట్లు లాభపడి 23,659 వద్ద స్థిరపడింది. షేర్ల పరంగా చూస్తే హిటాచీ ఎనర్జీ, ఏబీబీ ఇండియా, సీజీ పవర్, సీమన్స్, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి సంస్థల షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. మరోవైపు పీఐ ఇండస్ట్రీస్, కేన్స్ టెక్నాలజీ, ఎల్‌టీఎమ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, భారత్ ఎలక్ట్రికల్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ 153 పాయింట్లు పెరగగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 301 పాయింట్లు ఎగసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.82 వద్ద కొనసాగుతోంది.

## కరెంట్ బిల్లులతో షాక్

**న్యూఢిల్లీ, మే 20:** దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు త్వరలోనే భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో స్థిర ఛార్జీలను పెంచే దిశగా కీలక చర్యలు చేపడుతోంది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ అథారిటీ కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆదాయం తగ్గిపోతోందని అధికారులు చెబుతున్నారు. ఈ నష్టాలను తగ్గించేందుకు ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపు అవసరమని కేంద్రం భావిస్తోంది. దేశంలో ముఖ్యంగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ధనిక కుటుంబాలు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. దీంతో వారు ప్రభుత్వ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గించారు. అవసరమైనప్పుడు మాత్రమే గ్రిడ్ నుంచి కరెంట్ తీసుకుంటున్నారు. ఫలితంగా డిస్కంలకు రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని కేంద్ర విద్యుత్ సంస్థలు చెబుతున్నాయి. అయితే గ్రిడ్ నిర్వహణ, విద్యుత్ సరఫరా మౌలిక సదుపాయాల నిర్వహణ ఖర్చులు మాత్రం యథాతథంగానే కొనసాగుతున్నాయి. ఈ కారణంగానే వినియోగదారులపై స్థిర ఛార్జీల భారం మోపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం ఈ పెంపును ఒక్కసారిగా కాకుండా దశలవారీగా అమలు చేయనున్నారు. 2030 నాటికి గృహ, వ్యవసాయ వినియోగదారుల నుంచి మొత్తం స్థిర ఖర్చుల్లో 25 శాతం వరకు వసూలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మరోవైపు వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారుల నుంచి పూర్తి స్థాయిలో స్థిర ఛార్జీలు వసూలు చేయాలని యోచిస్తున్నారు. దీని ప్రభావంతో కరెంట్ వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ నెలవారీ బిల్లుల్లో కనీస స్థిర ఛార్జీలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



### జూన్ నుంచి ప్రియులకు భారీ షాక్



**హైదరాబాద్, మే 20:** తెలంగాణలో మద్యం ప్రియులకు త్వరలోనే భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను పెంచే దిశగా కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే లక్ష్యంతో అధికారులు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. జూన్ 2 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం మద్యం ధరలను మొదటగా 10 నుంచి 15 శాతం వరకు పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ స్థాయి పెంపుతో ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఆదాయం రాదని భావిస్తున్న కొందరు అధికారులు మరింత ఎక్కువగా ధరలు పెంచాలని సూచించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల ప్రత్యేక కమిటీ ఇప్పటికే తమ నివేదికను సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ మద్యం ధరలను ఏకంగా 25 నుంచి 30 శాతం వరకు పెంచాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తే బ్రాండ్లను బట్టి ప్రతి మద్యం సీసాపై భారీగా ధరలు పెరగనున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, సంక్షేమ పథకాల భారం, పెరుగుతున్న ఖర్చులు వంటి కారణాలతో ప్రభుత్వం అదనపు ఆదాయ వనరులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచేందుకు మద్యం ధరల పెంపు దాదాపు ఖాయమనే చర్చ సాగుతోంది. అయితే కొత్త ధరలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయన్న విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

# పెట్రోల్ ధరల సెగ


### డెలివరీ ఛార్జీలు పెరిగే సూచనలు




**న్యూఢిల్లీ, మే 20:** ప్రస్తుతం పది నిమిషాల్లో ఇంటికే సరుకులు, ఆహారం అందించే క్విక్ కామర్స్ సేవలు ప్రజల జీవితంలో భాగమయ్యాయి. బిర్యానీ నుంచి కూరగాయల వరకు అన్నీ మొబైల్ యాప్‌ల ద్వారా చిటికెలో ఇంటి ముందుకు చేరుతున్నాయి. అయితే తరచూ ఆన్‌లైన్ ఆర్డర్లు చేసే వినియోగదారులకు త్వరలోనే అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న పెట్రోల్ ధరల ప్రభావంతో డెలివరీ ఛార్జీలు పెరిగే పరిస్థితులు ఏర్పడుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగడం వల్ల దేశీయంగా ఇంధన ధరలు ఇటీవల పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సుమారు నాలుగు రూపాయల వరకు పెరుగుదల నమోదైనట్లు సమాచారం. ఈ ప్రభావం ఆహార సరఫరా, క్విక్ కామర్స్ సంస్థలపై పడుతోందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ ఎలారా రాజధాని తన తాజా నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం ప్రస్తుతం క్విక్ కామర్స్ విభాగంలో ఒక్కో ఆర్డర్ డెలివరీ చేయడానికి కంపెనీలకు సుమారు 35 నుంచి 50 రూపాయల వరకు ఖర్చవుతోంది. ఆహార సరఫరా సేవల్లో ఈ వ్యయం మరింత ఎక్కువగా ఉండి ఒక్కో ఆర్డర్‌కు 55 నుంచి 60 రూపాయల వరకు వెళ్తోందని అంచనా. సగటున చూస్తే స్విగ్గీ వంటి సంస్థలకు ఒక్కో డెలివరీపై భారీ ఖర్చు పడుతోందని నివేదిక చెబుతోంది. ఈ డెలివరీ ఖర్చులో దాదాపు 20 శాతం వరకు కేవలం ఇంధన వ్యయమే ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. పెట్రోల్ ధరలు మరింత పెరిగితే కంపెనీలు అదనపు భారం వినియోగదారులపై మోపే అవకాశముందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో డెలివరీ ఛార్జీలు పెరగవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

## వారంలో రెండు రోజులు ఇంటి నుంచే పని


**ముంబై, మే 20 :** దేశంలో పెరుగుతున్న ఇంధన సంక్షోభం, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ పిలుపు నేపథ్యంలో ప్రైవేటు బ్యాంకింగ్ రంగ దిగ్గజం హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు వారంలో రెండు రోజుల పాటు ఇంటి నుంచే పనిచేసే అవకాశం కల్పిస్తూ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలు ఇంధన పొదుపు కోసం 'ఇంటి నుంచే పని' విధానాన్ని ప్రోత్సహించాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా స్పందించి ఉద్యోగుల కోసం ప్రత్యేక సౌకర్యాన్ని ప్రకటించింది. బ్యాంకు విడుదల చేసిన వివరాల ప్రకారం కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఈ సౌకర్యం వర్తించనుంది. వారంలో రెండు రోజులు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ఈ విధానం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే ఈ నిర్ణయాన్ని మొదటగా నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు బ్యాంకు పేర్కొంది. ఉద్యోగుల పనితీరు, సేవల నాణ్యత, కార్యాచరణ సామర్థ్యాన్ని పరిశీలించిన తర్వాత దీన్ని శాశ్వతంగా కొనసాగించాలా వద్దా అన్న అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది. ట్రెజరీ కార్యకలాపాలు, అంతర్గత లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, మానవ వనరుల విభాగం, ఆర్థిక లెక్కల విభాగం వంటి కొన్ని ప్రత్యేక శాఖల ఉద్యోగులకు మాత్రమే ఈ సదుపాయం వర్తించనుంది. మరోవైపు బ్రాంచ్‌లలో కస్టమర్లతో ప్రత్యక్షంగా పనిచేసే నగదు కౌంటర్, ముందస్తు సేవల విభాగాల ఉద్యోగులకు ఈ సౌకర్యం ఉండదని బ్యాంకు తెలిపింది. ఇంటి నుంచే పని చేసినా బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని, అత్యాధునిక సాంకేతిక వసతులతో వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది.




# వర్క్‌ఫ్రమ్ హోం తర్వాత లేఆఫ్స్.. మెటాలో కలకలం

న్యూయార్క్, మే 20 : ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థ మార్క్ జుకర్‌బర్గ్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులకు శ్రీకారం చుట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈసారి దాదాపు 8 వేల మంది ఉద్యోగులపై వేటు పడినట్లు సమాచారం. ముందుగా ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం ఇచ్చి, అనంతరం సైలెంట్‌గా లేఆఫ్స్ అమలు చేసినట్లు వార్తలు రావడం సంస్థలో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు తెల్లవారుజామునే తొలగింపు ఈమెయిల్స్ అందినట్లు తెలుస్తోంది. తొలుత సింగపూర్‌లోని సిబ్బందికి సమాచారం వెళ్లగా, అనంతరం అమెరికా, బ్రిటన్ ఉద్యోగులకు కూడా అదే తరహా నోటీసులు చేరాయి. తాజా విడతలో తొలగింపులకు గురైన వారి సంఖ్య సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 10 శాతం వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. లేఆఫ్స్‌కు ముందు మెటాలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 78 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఇప్పుడు భారీగా సిబ్బందిని తగ్గించినట్లు తెలుస్తోంది. తొలగించని కొంతమంది ఉద్యోగులను కృత్రిమ మేధస్సు ఆధారిత విభాగాలకు బదిలీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సంస్థ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్ గేల్ ఉద్యోగులకు అంతర్గత మెమో పంపినట్లు కథనాలు చెబుతున్నాయి. తక్కువ మంది ఉద్యోగులతో సమర్థవంతంగా కార్యకలాపాలు నిర్వహించే దిశగా సంస్థ మార్పులు చేపడుతోందని అందులో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇంజనీరింగ్, ప్రొడక్ట్ విభాగాలపై ఈ లేఆఫ్స్ ప్రభావం ఎక్కువగా పడినట్లు తెలుస్తోంది. ఇక సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ ఇటీవలే మెటాను పూర్తిగా ఏఐ కేంద్రంగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది కృత్రిమ మేధస్సు రంగంలో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో సంస్థలో మరిన్ని మార్పులు, ఉద్యోగుల కోతలు కూడా ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఉద్యోగుల కీబోర్డ్ టైపింగ్, మౌస్ కదలికలను విశ్లేషించే కొత్త ఏఐ సాధనంపై కూడా సంస్థలో అసంతృప్తి పెరిగినట్లు తెలుస్తోంది. ఈ టూల్‌కు వ్యతిరేకంగా వెయ్యికి పైగా ఉద్యోగులు అంతర్గత పిటిషన్‌పై సంతకాలు చేసినట్లు సమాచారం. వర్క్ ఫ్రం హోం పేరుతో ముందుగా ఆఫీసుల నుంచి దూరం చేసి, తర్వాత ఉద్యోగాల నుంచి తొలగించారని కొందరు ఉద్యోగులు భావిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.






## ఆసియా క్రీడల బరిలోకి
# మరోసారి జ్యోతి సురేఖ

### మంత్రి లోకేశ్‌ను కలిసిన స్టార్ ఆర్చర్

### రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి ప్రశంసలు

**అమరావతి, మే 20 :** అంతర్జాతీయ విలువిద్యలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2026 ఆసియా క్రీడలకు వరుసగా నాలుగోసారి ఎంపికైన నేపథ్యంలో ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. విలువిద్యలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రానున్న ఆసియా క్రీడల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణిగా ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ సాధించిన విజయాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.




## వైభవ్ సంబరాల వెనుక అసలు
# రహస్యం ఇదే..!

**జైపూర్, మే 20:** వైభవ్ సూర్యవంశీ మరోసారి తన విధ్వంసక బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను అలరించాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న ఈ యువ ఆటగాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక పోరులో కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో పది భారీ సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉండటం విశేషం. అర్ధ సెంచరీ పూర్తి చేసిన తర్వాత వైభవ్ చేసిన ప్రత్యేక సంబరాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. రెండు చేతుల వేళ్లను క్రాస్ చేస్తూ ఇచ్చిన ఫోజ్‌కు ప్రత్యేక అర్థం ఉందా అని అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకున్నారు. మ్యాచ్ అనంతరం మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ ఈ విషయంపై ప్రశ్నించగా వైభవ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. తాను చేసే ప్రతి మ్యాచ్‌లో కొత్త తరహా సంబరాలు చేసుకోవడం అలవాటేనని, ఆ ఫోజ్ వెనుక ఎలాంటి ప్రత్యేక సంకేతం లేదని స్పష్టం చేశాడు. గత మ్యాచ్‌లో కూడా భిన్నంగా సంబరాలు చేసుకున్నానని, ప్రతి సారి కొత్తగా ఏదో చేయాలని అనిపిస్తుందని తెలిపాడు. ఇదిలా ఉండగా ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాల్సిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ 96 పరుగులతో మెరిసగా, జోష్ ఇంగ్లిస్ 60 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ జట్టు 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు యశస్వి జైస్వాల్ 43 పరుగులు, ధృవ్ జురెల్ అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించారు. ఈ విజయంతో రాజస్థాన్ లీగ్ పట్టికలో నాలుగో స్థానానికి చేరుకుంది. చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించనుంది. వైభవ్ సూర్యవంశీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారం దక్కింది.

# కోల్‌కతా సూపర్ విక్టరీ!

- ముంబై ఇండియన్స్‌పై 4 వికెట్ల తేడాతో ఘన విజయం
- ఈ గెలుపుతో సజీవంగా కోల్ కతా ప్లే ఆఫ్స్ ఆశలు
- పంజాబ్, రాజస్థాన్ జట్ల ఫలితాలపైనే తదుపరి బెర్త్
- పాయింట్ల పట్టికలో 13 పాయింట్లతో ఆరో స్థానానికి చేరిక

**ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అదరగొట్టింది. బుధవారం కోల్‌కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై ఇండియన్స్ పై 4 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ విజయంతో కోల్ కతా తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.**






**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం 2026 మే 20 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముంబై బ్యాటర్లలో కార్బిన్ బాష్ 18 బంతుల్లో 32 పరుగులతో అజేయంగా నిలవగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 26 పరుగులు, తిలక్ వర్మ 32 బంతుల్లో 20 పరుగులు చేసి మోస్తరు స్కోరుకు పరిమితమయ్యారు. కోల్ కతా బౌలర్లలో కార్బిన్ బాష్ 3 ఓవర్లలో 30 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్, అల్లాహ్ గజన్ఫర్ 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు.

### రాణించిన మనీష్ పాండే, పావెల్..

148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 7 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది. బ్యాటర్లలో మనీష్ పాండే 33 బంతుల్లో 45 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా రోవ్ మన్ పావెల్ 30 బంతుల్లో 40 పరుగులు, అజింక్య రహానే 17 బంతుల్లో 21 పరుగులు చేసి సత్తా చాటారు. ముంబై బౌలర్లలో కామెరూన్ గ్రీన్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి 2 వికెట్లు, సౌరభ్ దూబే 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు.



### ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..

ఈ అద్భుత విజయంతో కోల్ కతా నైట్ రైడర్స్ ప్లే ఆఫ్స్ రేసులో తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన కోల్ కతా 6 విజయాలతో 13 పాయింట్లు సాధించి ఆరో స్థానానికి చేరుకుంది. అయితే కోల్ కతా ప్లే ఆఫ్స్ కు చేరాలంటే పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఆడే తదుపరి మ్యాచ్ ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజస్థాన్ 13 మ్యాచ్ లలో 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా, పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్ లలో 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ రెండు జట్ల ఫలితాలే కోల్ కతా ప్లే ఆఫ్స్ బెర్త్ ను ప్రభావితం చేయనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడి కేవలం 4 విజయాలు, 9 ఓటములతో 8 పాయింట్లు మాత్రమే సాధించి తొమ్మిదో స్థానానికి పరిమితమైంది.

# కెప్టెన్సీ ఒత్తిడిపై కోహ్లీ భావోద్వేగం




**న్యూఢిల్లీ, మే 20 :** భారత టెస్టు జట్టుకు దాదాపు ఏడేళ్ల పాటు నాయకత్వం వహించిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, తాను టెస్టు కెప్టెన్సీ ఎందుకు వదులుకోవాల్సి వచ్చిందో తాజాగా వెల్లడించాడు. కెప్టెన్సీ బాధ్యతలు తనపై తీవ్ర మానసిక ఒత్తిడి మోపాయని, ఆ సమయంలో పూర్తిగా అలసిపోయినట్లు తెలిపాడు. టీ20 లీగ్‌ల హవా పెరిగిన సమయంలో కూడా అభిమానులను టెస్టు క్రికెట్ వైపు మళ్లించి, ఆటపై ఆసక్తిని పెంచిన ఆటగాడిగా కోహ్లీ ప్రత్యేక గుర్తింపు పొందాడు. భారత జట్టుకు 68 టెస్టుల్లో నాయకత్వం వహించిన అతడు 40 విజయాలు అందించి అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా నిలిచాడు. 2022 జనవరిలో అనూహ్యంగా టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కోహ్లీ, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వివరించాడు. "భారత జట్టు ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండాలనే లక్ష్యంతోనే పని చేశాను. కానీ కెప్టెన్సీ నాపై ఎంతటి మానసిక భారాన్ని మోపిందో అప్పట్లో పూర్తిగా అర్థం కాలేదు. బ్యాటింగ్‌తో పాటు నాయకత్వ బాధ్యతలు కూడా నా వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం చూపాయి" అని కోహ్లీ చెప్పాడు. ప్రతి మ్యాచ్‌లో తన బ్యాటింగ్‌పై భారీ అంచనాలు ఉండేవని, అదే తనలో తీవ్ర ఒత్తిడికి కారణమైందని తెలిపాడు. "కెప్టెన్సీ వదిలే సమయానికి నేను పూర్తిగా అలసిపోయాను. ఆ బాధ్యతలు నన్ను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. అందుకే నెమ్మదిగా ఆ బాధ్యతల నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నాను" అని వివరించాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా తాను క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నట్లు కోహ్లీ తెలిపాడు. ఆ సమయంలో భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తనకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేసుకున్నాడు. "వారిద్దరితో ఎక్కువగా మాట్లాడేవాడిని. నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నేను సాధించిన విజయాలు, రికార్డులను గుర్తు చేస్తూ మళ్లీ నాలో ఉత్సాహాన్ని నింపారు. వారి కోసం ఆడాలనిపించేలా నాలో నమ్మకం పెంచారు" అని కోహ్లీ భావోద్వేగంగా చెప్పాడు.

# పాకిస్థాన్‌పై బంగ్లా చారిత్రక విజయం

**సిల్హెట్, మే 20:** పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ జట్టు చరిత్ర సృష్టించింది. రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించిన బంగ్లాదేశ్, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. ఈ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2027 పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ ఐదో స్థానానికి ఎగబాకింది. 58.33 శాతం విజయ శాతంతో భారత్‌ను వెనక్కి నెట్టింది. ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు ఆడిన భారత జట్టు నాలుగు విజయాలు, నాలుగు ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఆరో స్థానానికి పడిపోయింది. మరోవైపు ఈ సిరీస్ పరాజయంతో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. చివరి రోజు 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 316 పరుగులకు ఏడు వికెట్ల నష్టంతో ఆట ప్రారంభించింది. అయితే బంగ్లాదేశ్ బౌలర్లు అద్భుతంగా రాణించి మరో 42 పరుగులకే మిగతా వికెట్లు కూల్చేశారు. దీంతో పాకిస్థాన్ జట్టు 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్ ఒంటరి పోరాటం చేశాడు. 94 పరుగులు చేసిన అతడు సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన వెంటనే పాకిస్థాన్ ఇన్నింగ్స్ పూర్తిగా కుప్పకూలింది. బంగ్లాదేశ్ తరఫున తైజుల్ ఇస్లామ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు. చివరి రోజు కీలక వికెట్లు తీసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ప్రమాదకరంగా మారిన రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లాదేశ్ విజయం ఖాయమైంది. గతంలో 2024లో పాకిస్థాన్ గడ్డపై 2-0తో సిరీస్ గెలిచిన బంగ్లాదేశ్, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.




KANCHARLA మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక






# ఎన్టీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళు తున్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు. పవర్‌హౌస్, నా రావణ.. తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. 'డ్రాగన్' గ్లింప్స్ చాలా బాగుంది. మీ డ్యాషింగ్ లుక్ నాకు బాగా నచ్చింది. కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని బాబీ శుభాకాంక్షలు తెలిపారు.



# మోసపోయా!

## అనన్య నాగళ్ల భావోద్వేగం

**హైదరాబాద్, మే 20** :తెలుగు నటి అనన్య నాగళ్ల తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు వెల్లడిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆమె సినిమాల్లోకి రాకముందు ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. నటనపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ ప్రారంభించి, తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టారు. మల్లేశం చిత్రంతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, పొట్టేల్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య నాగళ్ల తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. "చాలా ఏళ్ల తర్వాత ఒక వ్యక్తి కారణంగా బాగా ఏడ్చాను. దాన్ని లవ్ ఫెయిల్యూర్ అని చెప్పను. కానీ నేను బాగా నమ్మిన వ్యక్తి నన్ను మోసం చేశాడు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బ్రేకప్ బాధను దాదాపు మూడేళ్ల పాటు అనుభవించినట్లు ఆమె తెలిపారు. "ఉదయం లేవగానే ఆ ఆలోచనలు వెంటాడేవి. ఎంత బిజీగా ఉన్నా అవే గుర్తొచ్చేవి. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లేదాన్ని. షూటింగ్ సమయంలో కేరవాన్‌లో కూర్చొని ఏడ్చి, తర్వాత కళ్లు తుడుచుకుని కెమెరా ముందుకు వచ్చేదాన్ని" అని అనన్య చెప్పారు. అమ్మాయిల భావోద్వేగాలను సమాజం సరిగా అర్థం చేసుకోవడం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "సోషల్ మీడియాలో అమ్మాయిల గురించి ఎన్నో మీమ్స్ వస్తుంటాయి. ఎక్కువగా అబ్బాయిల దృష్టికోణమే బయటకు వస్తుంది. కానీ అమ్మాయిల మనసులోని బాధ గురించి ఎవరూ మాట్లాడరు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం అనన్య నాగళ్ల చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# హీరోతో నటించే ఛాన్స్ కోసం..

**ముంబై, మే 20:** తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన నటి హెబ్బా పటేల్ మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ చిత్రం 'అధ్యక్ష'తో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, 'అలా ఎలా' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనంతరం 'కుమారి 21ఎఫ్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా తర్వాత హెబ్బాకు వరుస అవకాశాలు వచ్చాయి. 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు', 'మిస్టర్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గ్లామర్ పాత్రలతో పాటు విభిన్న కథాంశాలున్న సినిమాల్లో కూడా నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఓటీటీ వేదికలపైనా అడుగుపెట్టి 'మస్తీస్', 'వ్యవస్థ' వంటి వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించారు. ఇటీవల 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అభిమాన హీరో గురించి హెబ్బా పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అత్యంత ఇష్టమైన నటుడు జూనియర్ ఎన్టీఆర్ అని ఆమె తెలిపారు. 'కుమారి 21ఎఫ్' టీజర్ విడుదల కార్యక్రమానికి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుంచి ఆయనపై ప్రత్యేక అభిమానం పెరిగిందన్నారు. తారక్ నటన, వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ సినిమాలో అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమని హెబ్బా వెల్లడించారు. పాత్రకు పెద్ద ప్రాధాన్యత లేకపోయినా, కథలో చిన్న భాగమే అయినా నటించేందుకు సిద్ధమేనన్నారు. కొన్నిసార్లు కెరీర్ కంటే మనసులోని కోరిక నెరవేర్చుకోవడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. అలాగే నటుడు సునీల్ చాలా మంచివాడని, ఎంతో కేరింగ్‌గా ఉంటాడని చెప్పారు. నటుడు రాజ్ తరుణ్‌తో కలిసి ఎక్కువ సినిమాలు చేయడం వల్ల మంచి అనుబంధం ఏర్పడిందని తెలిపారు. అయితే వరుసగా కలిసి సినిమాలు చేయడంతో కొంత విరామం అవసరమని సరదాగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో చేసిన పాత్రలు తనకు ఎంతో నచ్చాయని హెబ్బా చెప్పారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే ఉన్నానని స్పష్టం చేశారు. ముంబైలో జన్మించిన హెబ్బా పటేల్ సామాజిక మాధ్యమాల్లో కూడా చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# మోడల్‌గా మొదలై..

## మిస్ గ్రాండ్ నుంచి సినీ ప్రపంచం వరకు..!

## పంకూరి గిద్వానికి పెరుగుతున్న గుర్తింపు



భారతీయ నటి, మోడల్ పంకూరి గిద్వాని ప్రస్తుతం సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆమె 2016లో ఫెమినా మిస్ గ్రాండ్ ఇండియా కిరీటాన్ని అందుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 1997 అక్టోబర్ 2న జన్మించిన పంకూరి గిద్వాని, 2019లో విడుదలైన ఉజ్డా చమన్ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం పలు ప్రాజెక్టుల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఆమె లవ్ మౌళి చిత్రంతో పరిచయమయ్యారు. ఇందులో హీరోగా నవదీప్ నటించగా, పంకూరి 'చిత్ర' పాత్రలో విభిన్నమైన నటన కనబరిచి మంచి ప్రశంసలు అందు కున్నారు. ఆలోచనల్లో ప్రత్యేకత కలిగిన యువతిగా ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటనతో పాటు సామాజిక రంగంలోనూ పంకూరి తన ముద్ర వేస్తున్నారు. 2021లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఖాదీ' ఉత్పత్తుల తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆమెను నియమించారు. సంప్రదాయ వస్త్రాల ప్రచారంలో ఆమె కీలక పాత్ర పోషించారు. సినిమాలతో పాటు ఓటీటీ వేదికలలోనూ ఆమె రాణిస్తున్నారు. లీక్డ్! వంటి సిరీస్‌లతో పాటు 'గులాబీ రేవ్డి' వంటి ప్రాజెక్టుల్లో నటిస్తూ విభిన్నమైన పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. యువ నటిగా పంకూరి గిద్వాని భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746